క్లుప్తంగా

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ వేణుగోపాలరావు

జి.సిగడాం: గ్రామస్థాయిలో నియమించిన బీఎల్ఓలు అంకితభావంతో పనిచేసి ఓటర్ల నమోదులో జిల్లాస్థాయిలో మొదటి స్థానంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావు అన్నారు. గురువారం తన కార్యాలయంలో బీఎల్ఓలతో సమావేశమై ఓటర్ల నమోదుపై చర్చించారు. డీటీ నిర్మల, ఆర్ఐ రామచంద్రరావు పాల్గొన్నారు.

నేత్రదాత కుటుంబానికి పరామర్శ


నేత్రదాన సర్టిఫికెట్ అందిస్తున్న రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన కొత్తపేటకు చెందిన బి.మౌనిక కుటుంబ సభ్యులను రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు గురువారం పరామర్శించారు. తల్లిదండ్రులు గోవిందరావు, ఉమాదేవిలను ఓదార్చారు. మౌనిక నేత్రదానంతో ఇద్దరికి చూపు వచ్చిందని, అవయవదానంతో ఇతరులకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. అనంతరం ఐ డొనేషన్ సర్టిఫికెట్ అందించారు. కార్యక్రమంలో నేత్ర టెక్నీషియన్ సుజాత, సభ్యులు చిన్మయరావు పాల్గొన్నారు.

డీలర్ల సమస్యలు పరిష్కరించాలి


సమావేశంలో పాల్గొన్న డీలర్లు

ఎచ్చెర్ల : రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న వాహన సిబ్బందితో ఇబ్బందులు పడుతున్నామని డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు భాస్కరరావు అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది మిగిలిన స్టాక్ తిరిగి అప్పగించడం లేదని, డబ్బులు కూడా సక్రమంగా అందజేయడం లేదని చెప్పారు. దీంతో ఉన్నతాధికారులు తనిఖీలు చేపట్టినప్పుడు స్టాక్ కనిపించకపోవడం వల్ల డీలర్లపై 6ఏ కేసులు పెట్టే పరిస్థితి వస్తోందన్నారు. ఈ సమస్యపై అధికారులు దృష్టి పెట్టాలన్నారు. డీలర్లకు కమీషన్లు పెంచాలని కోరారు. సమావేశంలో డీలర్ల సంఘం కార్యదర్శి శిమ్మినాయుడు, కోశాధికారి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీదేవి విగ్రహావిష్కరణ


విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న శ్రీనివాసరావు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు సూర శ్రీనివాసరావు అన్నారు. తోటపాలెం ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో సొంత ఖర్చుతో ఏర్పాటు చేసిన సరస్వతీ దేవి విగ్రహాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ కల్లేపల్లి తిరుపతిరావు, హెచ్ఎం పీవీ నాగేంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజా ముక్కంటేశ్వరాలయంలో పూజలు


అర్చక దంపతులకు సన్మానం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని గిరిజా ముక్కంటేశ్వర ఆలయంలో కార్తీమాస ముగింపు సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివలింగానికి, గౌరీ దేవికి పూజలు అనంతరం దీపారాధన పాత్రలు నిమజ్జనం చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. ప్రధాన అర్చకులు పెంట రామారావు దంపతులకు బ్రాహ్మణ పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పెంట సంతోష్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

భూసర్వే పూర్తి చేయాలి

సరుబుజ్జిలి: భూముల రీసర్వే త్వరగా పూర్తిచేయాలని శ్రీకాకుళం ఆర్డీఓ సి.హెచ్.రంగయ్య ఆదేశించారు. నందికొండ గ్రామంలో క్షేత్రస్థాయిలో జరిగిన భూ సర్వేను గురువారం పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో భూ సర్వేరి కార్డులు తనిఖీ చేశారు. సర్వేలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా వారికి ముందస్తు సమాచారం అందించాలని సూచించారు.

సీఎంను కలిసిన ప్రముఖులు

పలాస పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పలువురు ప్రముఖులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలు అందజేశారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్/శ్రీకాకుళం రూరల్




సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు

ఆనందపురంలో అన్నదానం

జి.సిగడాం: మండలంలోని ఆనందపురంలో బాబా ఆలయం వద్ద గురువారం అన్నదానం నిర్వహించారు. అంతకుముందు ప్రత్యేక పూజలు చేశారు.

బాబాకు ప్రత్యేక పూజలు

ఎచ్చెర్ల: మండలంలోని ఎస్ఎస్ఆర్‌పురంలో బాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి బాబాను దర్శించుకున్నారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాలు

గార: అర్హులైన ప్రతిఒక్కరికీ పారదర్శకంగా పథకాలు అందజేస్తున్నామని ఎంపీపీ గొండు రఘురామ్ అన్నారు. గురువారం రామచంద్రాపురం సచివాలయం వద్ద సర్పంచ్ గొలివి వెంకటరమణమూర్తి ఆధ్వర్యంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించి సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయం పరిధిలో వివిధ పథకాల ద్వారా రూ.19 కోట్ల 15 లక్షలను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశామని వివరించారు. అనంతరం శిమ్మపేట జంక్షన్‌లో వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంజీవి రమణయ్య, మండల పార్టీ కన్వీనర్ పీస గోపి, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ ముంజేటి కృష్ణమూర్తి, వైస్ ఎంపీపీలు అరవల రామకృష్ణ, అంధవరపు బాలకృష్ణమూర్తి, యాళ్ల నారాయణమూర్తి, అంబటి చినబాబు, ఈవోపీఆర్డీ పి.శ్రీనివాసరావు, శీర సత్యం, గొలివి గోవింద, శీర ప్రభాకరరావు, సెక్రటరీ ఎం.రాము, వీఆర్వో బి.చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: సంక్షేమ పాలనకు ప్రజలు మద్దతు పలకాలని ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి కోరారు. బుడగట్లపాలెం గ్రామ సచివాలయం పరిధిలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జెండా ఎగురవేశారు. ప్రస్తుత ప్రభుత్వం, గత ప్రభుత్వ పాలనలో వ్యత్యాసాలను గమనించి ఓటు వేయాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ముద్దాడ శంకర్, జేసీఎస్ కన్వీనర్ మూగి శ్రీరాములు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ అంబటి రాంబాబు, నాయకులు మడ్డు లక్ష్మణరావు, సూరాడ రాములు తదితరులు పాల్గొన్నారు.


గార: రామచంద్రాపురం సచివాలయం వద్ద సంక్షేమ బోర్డు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ గొండు రఘురామ్, నాయకులు

లావేరు: మండలంలోని తామాడ సచివాలయం వద్ద గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సంక్షేమ పథకాల బోర్డును ప్రదర్శించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు రొక్కం బాలకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు దన్నాన రాజినాయుడు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి మీసాల శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ పాలిశెట్టి మధుబాబు, మాజీ ఎంపీటీసీ రఘుమండల కృష్ణ, మహిళా అధ్యక్షురాలు ఎం.వి జయలక్ష్మీ, నాయకులు వాళ్లే దాలినాయుడు, కొమ్ము సాయికుమార్, నడుపూరి రాంబాబు, గొర్లె సూర్యప్రకాష్, పాలిశెట్టి మల్లిబాబు, దండా హరీష్, అశిరినాయుడు, అప్పన్న, సింహాద్రినాయుడు, లక్ష్మణరావు, సచివాలయం కన్వీనర్‌లు, వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

జి.సిగడాం: మండలంలోని జాడ గ్రామ సచివాలయం వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ మీసాల సత్యవతి, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ ఆధ్వర్యంలో సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు ధర్మారావు, అప్పారావు, శ్రీనివాసరావు, లక్ష్మణరావు, కేశవరావు, ఇజ్జి కోటి, ఈఓపీఆర్డీ ఎస్.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి గౌరీ తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం: రావాడ సచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ టొంపల సీతారాం హాజరై సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. గత ప్రభుత్వం, ప్రస్తుతం వైఎస్సార్ సీపీ సర్కారు పాలనలో వ్యత్యాసాలను ప్రజలు తెలియజేసి ఇంటింటికీ వెళ్లి పథకాల బుక్‌లెట్లు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి ధనుంజయరావు, ఈవోపీఆర్డీ ప్రభాకరరావు, మండల పార్టీ అధ్యక్షుడు మహంతి పెద్దరామినాయుడు, జేసీఎస్ ఇన్‌చార్జి చిల్ల వెంకటరెడ్డి, నాయకులు మహంతి చినరామినాయుడు, గొర్లె శ్రీనివాసరావు, కిల్లారి రమణ, కిల్లారి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


శ్రీకాకుళం రూరల్: పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు

శ్రీకాకుళం రూరల్: సంక్షేమం, అభివృద్ధి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు అన్నారు. సింగుపురం, మామిడివలస గ్రామాల్లో గురువారం వై ఏపీ నీడ్స్ జగన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా పథకాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ రుప్ప దివ్య, మండల పార్టీ అధ్యక్షుడు చిట్టి జనార్దనరావు పాల్గొన్నారు.


జి.సిగడాం : జాడలో సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న నాయకులు


ఎచ్చెర్ల క్యాంపస్: పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ చిరంజీవి


రావాడలో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు


లావేరు: తామాడ సచివాలయం వద్ద పథకాల బోర్డును ప్రదర్శిస్తున్న నాయకులు, అధికారులు

ఆడుదాం ఆంధ్ర కిట్లు పంపిణీ

ఎచ్చెర్ల : మండల పరిషత్ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్ర కిట్లను ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక వికాసానికి, శారీరక దారుఢ్యానికి క్రీడలు దోహదపడతాయని చెప్పారు. గ్రామీణ క్రీడాకారులను ఒలింపిక్స్ వంటి అంతర్జాతీయ క్రీడలకు సిద్ధం చేయాలన్న ఉద్దేశంతో జగనన్న ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, ఈవోపీఆర్డీ ఈశ్వరమ్మ, నాయకులు వెంకునాయుడు, గొలివి రామకృష్ణ, సాధు గణేష్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ చిరంజీవి

ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు


సమీక్ష నిర్వహిస్తున్న డీసీసీబీ జీఎం జగదీశ్వరరావు

ఎచ్చెర్ల క్యాంపస్: రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలును రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ జనరల్ మేనేజర్ జగదీశ్వరరావు అన్నారు. ఎచ్చెర్ల పీఏసీఎస్ కార్యాలయంలో ధాన్యం కొనుగోళ్ల విధి, విధానాలపై అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస మద్దతు ధర సాధారణ రకం (కామన్) క్వింటాల్‌కు రూ.2183, గ్రేడ్ 'ఎ' రకం క్వింటాల్‌కు రూ.2203 కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. మద్దతు ధర ప్రమాణాలపై ఆర్‌బీకే ఇన్‌చార్జిలు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు ఉన్నా టోల్ ఫ్రీ నంబర్లు 1902, 155251లను సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంపురం పీఏసీఎస్ అధ్యక్షుడు సనపల నారాయణరావు, శ్రీకాకుళం డివిజన్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ పూజారి జానకి, సిబ్బంది యోగేశ్వరరావు, ఎస్.డిల్లీశ్వరరావు, బోర ప్రసాదరావు, సీఈవో బలగ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్య స్వామికి అభిషేకం

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక గుడివీధిలోని ఉమా రుద్ర కోటేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో షష్టి ఉత్సవాల సందర్భంగా గురువారం స్వామివారికి పెరుగుతో అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు పెంట కిరణ్‌శర్మ, శ్రీనివాసశర్మల ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, వస్త్రాలంకరణ సేవ, అర్చన, ప్రదోషకాలార్చన తదితర పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు బి.రమణయ్య, ఎం.ఎస్.విజయకుమార్, భక్తులు పాల్గొన్నారు.


పెరుగుతో అభిషేకం చేస్తున్న అర్చకులు

అండర్ డ్రైనేజీ పనులు పూర్తి


క్రేన్ సహాయంతో రోడ్డు క్లియరెన్సు చేయిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్సు సమీపంలో అంబేడ్కర్ కూడలి నుంచి డేఅండ్ నైట్ జంక్షన్ వరకు కొద్దిరోజులుగా చేపడుతున్న అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులు గురువారంతో ముగిశాయి. దీంతో రెండువైపులా వాహనాలు వెళ్లడానికి మార్గం సుగమమైంది. ట్రాఫిక్ ఏఎస్ఐ కృష్ణారావు, రైటర్ నాగరాజు, కానిస్టేబుల్ హేమచంద్రలు క్రేన్ సహాయంతో రోడ్డు క్లియరెన్సు పనులు చేయించారు. నగర పాలక అధికారులు నెలరోజులుగా అండర్‌గ్రౌండ్‌లో మంచినీటి కుళాయిల మరమ్మతులు చేపట్టడంతో డీఎస్పీ సీహెచ్‌జీవీ ప్రసాదరావు ట్రాఫిక్ ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే.

వీధికుక్కల నియంత్రణపై దృష్టి


మాట్లాడుతున్న కమిషనర్ ఓబులేసు

శ్రీకాకుళం: వీధి కుక్కల సంతతి నియంత్రణపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు అన్నారు. ఖాజీపేట ఏబీసీ కేంద్రంలో గురువారం మానిటరింగ్ కమిటీ సమీక్ష నిర్వహించారు. స్నేహ జంతు సంక్షేమ సంస్థ, నగరపాలక సంస్థ సంయుక్తంగా చేపట్టిన వీధి కుక్కల సంతతి నియంత్రణ కార్యక్రమంపై పలు సూచనలు చేశారు. నగరపాలక సంస్థ హెల్త్ అధికారి డాక్టర్ వెంకటరావు, గ్రీన్‌మెర్సీ సంస్థ సీఈఓ కె.వి.రమణమూర్తి, పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ కృష్ణారావు, డాక్టర్ హేమంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థి ప్రతిభ


కార్తీక్‌కు బహుమతి అందజేస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: నగరంలోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాల 9వ తరగతి విద్యార్థి సీహెచ్ కార్తీక్ చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ కనబరిచాడు. ఇటీవల లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యంలో డేర్ టూ డ్రీం అంశంపై జరిగిన పీస్ పోస్టర్ డ్రాయింగ్ పోటీల్లో కన్సోలేషన్ బహుమతి కైవసం చేసుకున్నాడు. ఈ మేరకు గురువా లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు కార్తీక్‌ను అభినందించి బహుమతి, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ జిల్లా శాఖ ప్రతినిధులు నటుకుల మోహన్, బాడాన దేవభూషణరావు, పాఠశాల సిబ్బంది గౌరీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు


ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో గురువారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. అప్పర్ రూం చర్చి పాస్టర్ కె.సుజ్ఞానరావు, కె.వెస్లీ సుజ్ఞాన్ క్రీస్తు సందేశం వినిపించారు. అనంతరం యువతీ యువకులు నృత్యాలు, ఆరాధన గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో పలువురు క్రైస్తవులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రోత్సాహం అవసరం


ట్యాబ్స్ అందజేస్తున్న ఎంపీపీ రఘురామ్, అధికారులు

గార: దివ్యాంగులను అన్ని రంగాల్లోనూ ప్రోత్సహించి ప్రతిభ వెలికితీయాలని ఎంపీపీ గొండు రఘురామ్ అన్నారు. గురువారం కుమ్మరిపేట పాఠశాలలోని భవిత కేంద్రంలో సర్పంచ్ మార్పు పృథ్వీరాజ్ అధ్యక్షతన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం ద్వారా మంచి సేవలు అందుతున్నాయంటూ ఉద్యోగుల కృషిని అభినందించారు. ఎటువంటి సాయమైనా చేస్తామన్నారు. ఎంపీడీఓ సంజీవి రమణయ్య మాట్లాడుతూ వైకల్యం శరీరానికే కాని మనసుకు కాదన్నారు. ఒక్కొక్కరిలో ఒక్కో ప్రతిభ ఉంటుందన్నారు. సమగ్రశిక్ష ఐడీ కో ఆర్డినేటర్ బి.గోవిందరావు మాట్లాడుతూ ప్రభుత్వ సౌకర్యాలను వివరించారు. కేంద్రంలో 302 మందికి సేవలు అందుతున్నాయన్నారు. అనంతరం ఐదుగురు బధిరులకు ట్యాబ్స్ అందజేశారు. క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆరంగి రమణమూర్తి, ఎంఈవో ఎస్.రామకృష్ణ, ఏ.రఘులక్ష్మీ, ఎస్.సూర్యనారాయణ పాల్గొన్నారు.

తిమడాం వాసికి ఆర్‌బీఐలో మేనేజర్ కొలువు

జలుమూరు: మండలంలోని తిమడాం గ్రామానికి చెందిన సిరినెల్లి నవీన్ కుమార్ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో మేనేజర్ పోస్టుకు ఎంపికయ్యారు. గురువారం ఫలితాలు విడుదలైనట్లు నవీన్‌కుమార్ తెలిపారు. ప్రాథమిక, హైస్కూల్ విద్య నరసన్నపేటలో, ఇంటర్ విశాఖపట్నంలో, ఇంజినీరింగ్ కాంచిపురం ట్రిపుల్ ఐటీ(చెన్నయ్)లో పూర్తి చేశారు. యూనియన్ బ్యాంక్(రాజమండ్రి)లో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. నవీన్‌కుమార్‌ది వ్యవసాయ కుటుంబం.

ఎనర్జీ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలి


ఏఈకి వినతిపత్రం అందజేస్తున్న ఎనర్జీ అసిస్టెంట్లు

గార: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సచివాలయాల్లో పనిచేస్తున్న ఎనర్జీ అసిస్టెంట్లు గురువారం ఏఈ పవన్‌కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎంపీడీవో సంజీవ రమణయ్యను కలిసి వినతి పత్రాలు అందజేశారు. సర్వీసు రిజిస్టర్లు ఓపెన్ చేయాలని, డిపార్టుమెంట్‌లో గానీ, సచివాలయ వ్యవస్థలో గానీ ఏదో ఒకదాని పరిధిలోకి పూర్తిస్థాయిలో తమను తీసుకోవాలని విన్నవించారు.